సాక్షి అనంతపురం

మంగళవారం । 30 । జూలై । 2024



టన్ను చీనీ రూ.17 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.17 వేలు పలికాయి.



టమాట కిలో రూ.30

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్టంగా రూ.30, కనిష్టంగా రూ.13 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
35.2°/24.7°

జిల్లా పరిధిలో సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై పలు మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. గంటకు 10 నుంచి 18 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

జనావాసాల్లోకి ఎలుగుబంటి



బిస్కెట్ ఏజెన్సీ గోదాములో చొరబడిన ఎలుగుబంటి

కళ్యాణదుర్గం: స్థానిక దొడగట్ట రోడ్డులో మార్కెట్ యార్డు ఎదురుగా ఉన్న బిస్కెట్ ఏజెన్సీ గోదాములోకి సోమవారం తెల్లవారు జామున 3 గంటల సమయంలో ఎలుగుబంటి చొరబడింది. కాంపౌండ్‌లో ఉన్న బాత్‌రూం తలుపులు పగులగొట్టి బిస్కెట్ బాక్సులను చించేసి బిస్కెట్లను తినేసింది. ఈ దృశ్యాలన్నీ గోదాములో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. కాగా, చీకటి పడితే ఎలుగుబంట్ల బెడద ఎక్కువైందని స్థానికులు వాపోతున్నారు. మంగళకాలనీ, పూర్ణానంద ఆశ్రమం పరిసరాల్లో నిత్యం ఎలుగుబంట్లు తిరుగుతుంటాయని వాపోతున్నారు. అర్ధరాత్రి సమయంలో ఏకంగా ఇళ్లలోకి చొరబడుతున్నాయని భయాందోళన చెందుతున్నారు. అటవీ శాఖ అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

చిరుత సంచారంతో హడల్



గుట్టపై కూర్చున్న చిరుత

కూడేరు: మండల పరిధిలోని మరుట్ల–2 కాలనీలో పెనక చెర్ల డ్యాంకు వెళ్లే దారిలో ఉన్న గుట్టలో చిరుత సంచరిస్తోంది. సోమవారం రాము అనే రైతుకు కనిపించగా.. గట్టిగా శబ్దాలు చేయడంతో గుట్టపైకి వెళ్లి కూర్చుంది. చిరుత సంచారంతో గ్రామస్తులు హడలెత్తుతున్నారు. పొలాల్లోకి వెళ్లేందుకు భయపడుతున్నారు. రెండు రోజుల క్రితం మేపునకు తీసుకెళ్లిన తన జీవాలపై చిరుత దాడి చేసినట్లు గ్రామానికి చెందిన వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. అటవీ శాఖ అధికారులు స్పందించి చిరుతను బంధించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

చిరుత కళేబరానికి పోస్టుమార్టం



చిరుత కళేబరాన్ని పరిశీలిస్తున్న ఎఫ్ఆర్ఓ శ్రీనివాసులు

కూడేరు: మండల పరిధిలోని రామదుర్గం (ఆంజనేయ స్వామి ఆలయం వద్ద) గుట్ట సమీపంలో మృతి చెందిన చిరుత కళేబరాన్ని సోమవారం ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ (ఎఫ్ఆర్ఓ) శ్రీనివాసులు, పంపనూరు పశు వైద్యాధికారి దిలీప్ కుమార్ పరిశీలించారు. అక్కడే పోస్టుమార్టం చేపట్టారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ విలేకరులతో మాట్లాడుతూ చిరుతది సాధారణ మరణమేనన్నారు. వయసు పైబడడం, ఆహారం సరిగా లభించకపోవడంతో తాను ఏర్పరచుకున్న స్థావరంలోనే నిద్రిస్తూ మృతి చెందిందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ హుసేనప్ప, బీట్ ఆఫీసర్ జగదీష్, ఏబీఓ రామ్మోహన్, పశు వైద్యాధికారి దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి చేస్తున్న డ్రామాలు రక్తి కట్టడం లేదు. తాను అవినీతి పరుడిని కాను అని నిరూపించుకునేందుకు ఆయన పడుతున్న పాట్లు చూసి జనం నవ్వుకుంటున్నారు. సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా నమ్మడం లేదు. కేసుల్లో నిందితుడిగా ఉన్న వ్యక్తి నానా హంగామా చేస్తుండడం చూసి ఈసడించుకుంటున్నారు. దీంతో జేసీ ప్రభాకర్ రెడ్డి కొత్త రకం డ్రామాలకు తెరతీస్తున్నారనే విమర్శలొస్తున్నాయి.



రక్తికట్టని జేసీ డ్రామా!

- బీఎస్ 3 వాహనాల అక్రమ రిజిస్ట్రేషన్ కేసులో జేసీ ప్రభాకర్‌రెడ్డి నిందితుడు
- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాహనాలు విడుదల చేయాలని డిమాండ్
- పోలీస్ స్టేషన్ల ముందు ధర్నాలు, పలువురు పోలీసు అధికారులకు ఫిర్యాదులు
- ఇప్పటికే ఈ కేసులపై సీబీఐ, ఈడీ సంస్థల విచారణ... కోర్టులో చార్జ్‌షీట్ల దాఖలు
- కోర్టు పరిధిలో ఉన్నప్పుడు జోక్యం చేసుకోలేమన్న రవాణా శాఖాధికారులు
- సీజ్ చేసిన వాహనాలను విడుదల చేయలేమని స్పష్టీకరణ

సాక్షి ప్రతినిధి, అనంతపురం: దేశంలోనే సంచలనం సృష్టించిన బీఎస్3 వాహనాల అమ్మకాల కేసులో జేసీ ప్రభాకర్‌రెడ్డి, ఆయన అనుచరుడు చవ్వా గోపాల్‌రెడ్డి కీలక నిందితులు. అత్యున్నత దర్యాప్తు సంస్థలైన ఈడీ, సీబీఐలే ఈ కేసులపై విచారణ చేసి కోర్టుల్లో చార్జ్‌షీట్‌లు వేశాయి. దీంతో కొన్ని రోజులుగా న్యాయస్థానాల్లో కేసుల విచారణ జరుగుతోంది. విషయం ఇలా ఉంటే.. రవాణా శాఖ అధికారులేదో తనకు అన్యాయం చేసినట్లు జేసీ ప్రభాకర్‌రెడ్డి చేస్తున్న యాగీ అంతా ఇంతా కాదు.

ధర్నాలు.. ఫిర్యాదులతో నవ్వుల పాలు

జేసీ ప్రభాకర్‌రెడ్డి బీఎస్3 వాహనాలను తుక్కు కింద కొని, నకిలీ ఇన్‌వాయిస్‌లు సృష్టించి ఇక్కడ బీఎస్4 కింద అమ్మారనేది ప్రధాన ఆరోపణ. దీంతో పాటు పర్మిట్లు లేకపోయినా వాహనాలను తిప్పిన కేసులో ఈయన వాహనాలను సీజ్ చేశారు. పక్కా ఆధారాలతో కేసు నమోదు చేయడమే కాదు, ఈ కేసులో జేసీ ప్రభాకర్‌రెడ్డి జైలుకు కూడా వెళ్లి వచ్చారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలిరోజు నుంచే జిల్లాలో అధికారులను బెదిరిస్తూ వ్యాఖ్యలు చేస్తున్నారు.ఆర్టీఏ అధికారులు, పోలీసులకు వార్నింగ్ ఇచ్చారు. వారం రోజుల క్రితం మందీమార్బలంతో అనంతపురం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ వద్దకు వచ్చారు. అప్పటి మంత్రి, రవాణా అధికారులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. తాడిపత్రిలో రోజూ ఒక వివాదాన్ని సృష్టించి భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. కేసులన్నీ కోర్టు పరిధిలో ఉన్నా తాను నిజాయితీ పరుడిని అని చెప్పుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. జేసీ ధర్నాలు, ఫిర్యాదులు చూసి కామెడీ చేస్తున్నట్టు జనం భావిస్తున్నారు.

సొంత పార్టీ నేతలే ఖండించలేదు..

జేసీ కుటుంబానికి తన సొంత పార్టీలోనే ఎవరి మద్దతూ లేదు. కేసులు నమోదైనప్పుడు గానీ, విచారణ జరుగుతున్నప్పుడు గానీ, జైలుకు వెళ్లినప్పుడు గానీ ఎవరూ మాట్లాడలేదు. దర్యాప్తు సంస్థల నివేదిక తప్పు అని ఏ ఒక్కరూ ఖండించలేదు. ఈ పరిస్థితుల్లో జేసీ ప్రభాకర్‌రెడ్డి తనకు న్యాయం జరగాలంటే విచారణ సంస్థలను ఆశ్రయించాల్సి పోయి పోలీసులను టార్గెట్ చేసి ముందుకెళ్తుండడంపై సొంతపార్టీలోనే తీవ్ర వ్యతిరేకత వస్తోంది. కూటమి ప్రభుత్వమే అధికారంలో ఉంది కదా.. చంద్రబాబునే ఆశ్రయించి కేసులు కొట్టివేయించుకోవచ్చు కదా అని ఒక రిటైర్డ్ పోలీసు అధికారి వ్యాఖ్యానించారు.

జోక్యం చేసుకోలేం

జేసీ ప్రభాకర్‌రెడ్డికి చెందిన కేసులన్నీ కోర్టు పరిధిలో ఉన్నాయి. వాటిపై జోక్యం చేసుకోలేం. ఇప్పటికే దీనిపై పూర్తిస్థాయి నివేదిక రవాణా శాఖ కమిషనర్‌కు అందజేశాం. జేసీ ప్రభాకర్ రెడ్డికి కూడా లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చాం. ఈ పరిస్థితుల్లో సీజ్‌చేసిన వాహనాలను విడుదల చేయలేం. కోర్టు నిర్ణయాన్ని బట్టి రవాణా శాఖ అప్పీల్‌కు వెళ్లాలా, కోర్టు ఉత్తర్వులు అమలు చేయాలా అన్నది ఉంటుంది. హైకోర్టుతో పాటు జిల్లా కోర్టులోనూ కేసులున్నాయి. కోర్టుల తీర్పు తర్వాతే వాహనాల విడుదలకు సంబంధించిన అంశం తేల్చాల్సి ఉంటుంది.

–వీర్రాజు, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్

పూర్వ విద్యార్థులే ఎస్కేయూ బ్రాండ్ అంబాసిడర్లు



శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాల వేస్తున్న ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి. అనిత

అనంతపురం: 'శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో చదివి ఎంతో మంది ఉన్నత స్థానాలను అధిరోహించారు. పూర్వ విద్యార్థులే వర్సిటీ బ్రాండ్ అంబాసిడర్లు. వారిని ఆదర్శంగా తీసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలి' అని ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి. అనిత అన్నారు. ఎస్కేయూ 44వ ఆవిర్భావ దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 1967లో పీజీ సెంటర్‌గా ఏర్పడిందన్నారు. 1976లో అటానమస్ పీజీ సెంటర్‌గా, 1981లో వర్సిటీగా ఆవిర్భవించిందని పేర్కొన్నారు. 487 ఎకరాల సువిశాల క్యాంపస్ అందుబాటులో ఉండడం అదృష్టమన్నారు. దక్షిణ భారతదేశంలోనే తొలి అటల్ ఇంక్యుబేషన్ కేంద్రం ఏర్పాటుతో జాతీయ స్థాయిలో వర్సిటీ ఖ్యాతి దక్కించుకుందన్నారు. 112 అనుబంధ డిగ్రీ కళాశాలల్లో లక్ష మంది విద్యార్థులు చదువుతుండడం విశేషమన్నారు. ఇప్పటిదాకా 3,113 మంది విద్యార్థులు డాక్టరేట్లు అందుకున్నారన్నారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత కొలకలూరి ఇనాక్, మాజీ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణా రావు, మాజీ డీజీపీ జాస్తి వెంకట్రాముడు ఎస్కేయూ పూర్వ విద్యార్థులు కావడం గర్వకారణమన్నారు. ముందుగా శ్రీకృష్ణదేవరాయ విగ్రహానికి ఇన్‌చార్జ్ వీసీ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్కేయూ రెక్టార్ ప్రొఫెసర్ జి. వెంకటనాయుడు, రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు నాణ్యమైన సేవలు

- బోధనాస్పత్రి అభివృద్ధికి చర్యలు
- మంత్రి సత్యకుమార్

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో రోగులకు నాణ్యమైన సేవలు అందుతున్నాయని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. సోమవారం ప్రభుత్వ సర్వజనాస్పత్రిని ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని గైనిక్, ఎస్ఎన్‌సీయూ, ఎన్ఆర్‌సీ, ఆర్థో, రక్తనిధి కేంద్రాన్ని పరిశీలించారు. రోగులకందుతున్న సేవలపై ఆరా తీశారు. వైద్య కళాశాలలో హెచ్ఓడీలతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో బోధనాస్పత్రిని అభివృద్ధి చేస్తామన్నారు. బోధనాస్పత్రిలో 560 పడకలున్నాయన్నారు. సర్వజనాస్పత్రిలో రోజూ ఓపీ 2 వేల నుంచి 3 వేల వరకూ నమోదవుతోందన్నారు. రోగులకు పలు ఇబ్బందులు కలుగుతున్న మాట వాస్తవమేనన్నారు. ఒక మంచంపై ఇద్దరు బాలింతలు పడుకునే ఇబ్బందికర పరిస్థితులున్నాయన్నారు. ఆస్పత్రిలో మార్పులు తీసుకురావాల్సి ఉందన్నారు. మిల్క్ బ్యాంక్, పార్కింగ్, రోగుల సహాయకులు ఉండేందుకు స్థలం లేదని.. ఇటువంటి ప్రతికూల పరిస్థితుల్లోనూ ఆస్పత్రి నిర్వహణ బాగుందన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఖరీదైన వైద్యం అందుతోందన్నారు. ప్రైవేటులో రూ.10 లక్షల విలువ చేసే సర్జరీని ఇటీవల జగిత్యాలకు చెందిన ఓ వ్యక్తికి ఉచితంగా చేశారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఆస్పత్రుల అభివృద్ధికి, నూతన వైద్య కళాశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. రోగులకు మెరుగైన వైద్యం అందించడంలో దాతలు తమ వంతు తోడ్పాటు అందించాలన్నారు. సీఎం చంద్రబాబు వికసిత్ ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆస్పత్రిలో ఎంసీహెచ్ బ్లాక్, సర్జికల్ బ్లాక్, సూపర్ స్పెషాలిటీకి పీజీ సీట్ల మంజూరుతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు, సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు మంత్రికి విజ్ఞప్తి చేయగా, సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, హెచ్ఓడీలు తదితరులు పాల్గొన్నారు.



రోగులతో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

స్నేహితుడి హత్య కేసులో ముగ్గురికి జీవిత ఖైదు

- ఒక్కొక్కరికి రూ.5 వేల జరిమానా
- అనంతపురం మహిళా కోర్టు తీర్పు

కళ్యాణదుర్గం: ఆ నలుగురూ స్నేహితులు. చిన్న చిన్న దొంగతనాలు చేసేవారు. ఈ క్రమంలో వారిలో ఒకడు పోలీసులకు చిక్కాడు. మిగతా ముగ్గురి గురించీ పోలీసులకు చెప్పాడు. దీంతో ఆగ్రహించిన ఆ ముగ్గురూ స్నేహితుడని కూడా చూడకుండా దారుణంగా హతమార్చారు. కళ్యాణదుర్గం అర్బన్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన ఈ హత్య కేసులో అనంతపురానికి చెందిన మారుతి, హనుమంతు, స్వర్ణరాజులకు జీవిత ఖైదు విధిస్తూ అనంతపురం మహిళా కోర్టు జడ్జి శోభారాణి సోమవారం సంచలన తీర్పు వెలువరించారు. వివరాలిలా ఉన్నాయి. జీవిత ఖైదు పడిన ముగ్గురూ అనంతపురానికి చెందిన భీమేష్‌కు స్నేహితులు. వీరంతా కలిసి చిన్న చిన్న దొంగతనాలు చేసేవారు. ఈ క్రమంలో భీమేష్ పోలీసులకు చిక్కాడు. మిగతా ముగ్గురూ దొంగతనాలలో పాలుపంచుకున్నట్లు పోలీసులకు తెలియజేశాడు. ఈ విషయంలో కోపం పెంచుకున్న ముగ్గురూ భీమేష్‌ను 2015 ఫిబ్రవరిలో కళ్యాణదుర్గం పట్టణ శివారులోని ధర్మవరం రోడ్డు సమీపంలో ఉన్న ఓ మామిడి తోటలోకి తీసుకెళ్లి తలపై రాయితో మోది చంపేశారు. శవాన్ని కూడా గుర్తు పట్టని విధంగా రాయితో బాదారు. ఈ ఘటనపై అప్పటి ఎస్ఐ జయనాయక్ కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ మన్సూరుద్దీన్ కేసు దర్యాప్తు చేపట్టి కోర్టులో చార్జ్‌షీటు దాఖలు చేశారు. ముద్దాయిలపై అభియోగాలు రుజువు కావడంతో ముగ్గురికీ జీవిత ఖైదు విధిస్తూ అనంతపురం మహిళా కోర్టు జడ్జి శోభారాణి తీర్పు చెప్పారు. అలాగే ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున జరిమానా విధించారు. ఈ కేసులో అడిషనల్ పీపీ సృజన ప్రాసిక్యూషన్ తరఫున వాదించారు. డీసీఆర్‌బీ సీఐ సుబ్రమణ్యం పర్యవేక్షణలో కోర్టు లైజన్ ఏఎస్ఐ శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుల్ సారెడ్డి, కానిస్టేబుల్ కృష్ణమోహన్ సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపరిచి, ముద్దాయిలకు శిక్ష పడేలా చేశారు. వారిని జిల్లా ఎస్పీ కేవీ మురళీ కృష్ణ అభినందించారు.

అర్జీలను పరిష్కరించాల్సిందే

అనంతపురం అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందే అర్జీలన్నింటినీ పరిష్కరించాల్సిందేనని కలెక్టర్ వినోద్‌కుమార్ స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో నిర్వహించిన 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక'లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై 394 వినతులు అందాయి. కార్యక్రమం అనంతరం అధికారులతో కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. సమస్య పరిష్కారం కానిదైతే, అర్జీదారునికి తెలియజేయడంతో పాటు ఎండార్స్‌మెంట్ ఇవ్వాలన్నారు.

వినతుల్లో కొన్ని...

- అనంతపురం నగరపాలక సంస్థలో పనిచేస్తున్న 150 మంది సిబ్బందికి ఈపీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం కల్పించలేదని ఎస్సీ మునిసిపల్ కార్మిక సంఘం అధ్యక్షుడు అజయ్‌బాబు, ఉపాధ్యక్షుడు సురేష్‌బాబు, నాయకులు ఓబుళేసు, నరసయ్య, పెద్దన్న తెలిపారు. విచారణ చేసి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

- వితంతు పింఛను మంజూరు చేయించాలని పెద్దపప్పూరు మండలం చీమలవాగులపల్లికి చెందిన గుజ్జల పుల్లమ్మ విన్నవించారు. తన భర్త గత ఏడాది నవంబరు 20న మరణించారన్నారు. ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారని చెప్పారు. తనకు చదివించే స్థోమత లేకపోవడంతో పిల్లలు చదువు ఆపేశారన్నారు. వితంతు పింఛను మంజూరు చేసి ఆదుకోవాలన్నారు.

ప్రజలకు భరోసా కల్పించాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

అనంతపురం: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులతో మాట్లాడి భరోసా కల్పించాలని ఎస్పీ కేవీ మురళీ కృష్ణ అన్నారు. అనంతపురం టూ టౌన్, ట్రాఫిక్, రూరల్ పోలీస్‌స్టేషన్లను సోమవారం ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ కేసుల్లో నిందితులకు శిక్ష పడేలా కృషి చేయాలన్నారు. ఏ కేసులోనైనా పురోగతి సాధించడం కీలకమన్నారు. కేసుల దర్యాప్తు ఆలస్యం చేయరాదన్నారు. కార్యక్రమంలో సీఐలు క్రాంతి కుమార్, రామకృష్ణా రెడ్డి ఉన్నారు.

ఆగని టీడీపీ దాష్టీకాలు

ఉరవకొండ: జిల్లాలో టీడీపీ నాయకుల దాష్టీకాలు ఆగడం లేదు. తాజాగా ఉరవకొండ మండల పరిధిలోని లత్తవరంలో ఆ పార్టీ నాయకులు రెచ్చిపోయారు. గ్రామ ఉప సర్పంచ్ బోయ నాగమ్మ భర్త, వైఎస్సార్‌సీపీ నాయకుడు బోయ హనుమంతుపై సోమవారం దాడి చేశారు. ఉప సర్పంచ్ ఇంట్లోకి చొరబడి దాడికి తెగబడ్డారు. అడ్డుకోబోయిన ఉప సర్పంచ్ నాగమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు సుధాకర్, పోలమ్మను కూడా కొట్టారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పాలడగు వంశీ, ఉపసర్పంచ్ నాగమ్మ మాట్లాడుతూ పదవులకు రాజీనామా చేయాలని గ్రామ మాజీ సర్పంచ్ గోవిందుతో పాటు ఇతర టీడీపీ నాయకులు నిత్యం తమను వేధిస్తున్నారన్నారు. ఈ క్రమంలోనే దాడులకు తెగబడ్డారన్నారు. ఇప్పటికే తమ ఇళ్లపైకి రాళ్లు వేసి భయభ్రాంతులకు గురి చేశారన్నారు. ఈ ఘటనపై ఉరవకొండ పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళ్తే తామే టీడీపీ నాయకులపై దాడి చేసినట్లు కేసులు నమోదు చేయడానికి సిద్ధవుతున్నారని వాపోయారు. తమతో బలవంతంగా రాజీనామాలు చేయించడం ప్రజాస్వామ్యాన్ని కాలరాయడమే అవుతుందని వాపోయారు.



గాయపడిన బోయ హనుమంతు



పోలమ్మ చేతిని రక్కిన దృశ్యం

గలగల.. కళకళ..!

- నిండుకుండలా తుంగభద్ర డ్యాం
- ఇప్పటికే హెచ్చెల్సీకి నీటి విడుదల
- సేద్యం పనుల్లో రైతుల నిమగ్నం
- ఆగస్టు రెండో వారంలో సాగునీటి సలహా మండలి సమావేశం

రాయదుర్గం/బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయానికి వరద నీరు పోటెత్తుతోంది. రిజర్వాయర్ ఎగువ ప్రాంతాల్లోని శివమొగ్గ, ఆగుంబె, తీర్థహళ్లి, సాగర, హొసనగర, కడూరు ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టలేదు. దీంతో తుంగభద్రమ్మ పరవళ్లు తొక్కుతోంది. సోమవారం ఉదయం 6 గంటలకు ఇన్ ఫ్లో 1,56,780 క్యూసెక్కులు నమోదైంది. రాత్రికి ఇన్‌ఫ్లో మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో 33 క్రస్ట్ గేట్లు ఎత్తి 1,56,248 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. వివిధ కాలువలకు 8,767 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. అందులో హెచ్ఎల్‌సీకి 775 క్యూసెక్కుల నీరు వస్తున్నాయి. మంగళవారం నుంచి వెయ్యి క్యూసెక్కులకు పెంచే అవకాశం ఉన్నట్టు అధికారులు వెల్లడించారు.

చురుగ్గా ఖరీఫ్ పనులు

హెచ్ఎల్‌సీ నీరు జిల్లాను తాకిన నేపథ్యంలో కాలువ పరివాహక ప్రాంతంలో సేద్యపు పనులు చురుగ్గా సాగుతున్నాయి. బోర్ల కింద ముందస్తుగా పెంచుకున్న వరి నార్లు నాటేందుకు కొందరు పెంటమళ్లు సిద్ధం చేశారు. ఈ సారి ముందస్తుగా నీరు రావడంతో అన్ని పనులు త్వరగా ముగిస్తామని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నీటికి ఢోకా లేదు..

ఇటీవల సమావేశమైన టీబీ బోర్డు 2024–25 ఖరీఫ్‌కు సంబంధించి తుంగభద్ర జలాశయంలో 172 టీఎంసీల నీటి లభ్యత ఉండవచ్చని అధికారులు అంచనాకు వచ్చారు. హెచ్ఎల్‌సీ వాటాగా 26.36 టీఎంసీలు కేటాయించారు. ఇప్పటికీ వరద ప్రవాహం కొనసాగుతుండడంతో కేటాయించిన నీరు పూర్తి స్థాయిలో రానున్నాయి. ఈ క్రమంలో సుమారు లక్ష ఎకరాలకు పైగా ఆయకట్టు సాగులోకి వచ్చే అవకాశం కనిపిస్తోంది.

ఆగస్టు రెండో వారంలో ఐఏబీ సమావేశం

జిల్లా సాగునీటి సలహా మండలి (ఐఏబీ) సమీక్ష సమావేశం ఆగస్టు రెండో వారంలో నిర్వహించేందుకు ఇరిగేషన్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో చర్చించి ఆయకట్టుకు నీటిని విడుదల చేయనున్నారు. సాగుతో పాటు తాగునీటికీ పెద్దపీట వేసేలా కార్యాచరణ చేపడుతున్నారు. అన్ని ప్రాంతాలకు సమన్యాయం చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.



నీటితో తొణకిసలాడుతున్న తుంగభద్ర డ్యాం

ప్రస్తుతం తుంగభద్ర డ్యాంలో నీటి నిల్వ ఇలా..	
ఇన్‌ఫ్లో	1,56,780 క్యూసెక్కులు
డ్యాం నీటి నిల్వ సామర్థ్యం	105.788 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	97.410 టీఎంసీలు
ఈ ఏడాది నీటి పంపకాలు ఇలా..	
హెచ్ఎల్‌సీ	770 క్యూసెక్కులు
పీఏబీఆర్	400 క్యూసెక్కులు
జీబీసీ	120 క్యూసెక్కులు
కణేకల్లు ఎస్ఎస్ ట్యాంకు	50 క్యూసెక్కులు

ఇబ్బంది ఉండకపోవచ్చు..

తుంగభద్ర జలాశయానికి వరద ఇంకా కొనసాగుతుండడంతో ఈ ఏడాది సాగు, తాగు నీటి అవసరాలకు ఇబ్బంది ఉండకపోవచ్చు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఆగస్టు రెండో వారంలో సాగునీటి సలహా మండలి సమావేశం జరుగుతుంది. హెచ్ఎల్‌సీ నీటిని ఎలా వాడుకోవాలనే విషయంపై ఇందులో చర్చిస్తారు. ప్రస్తుతం టీబీ డ్యాం నుంచి 775 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. ఈ క్రమంలో తాగునీటి అవసరాలకే ప్రాధాన్యత ఇస్తున్నాం.

– మద్దిలేటి, హెచ్ఎల్‌సీ, డీఈ

డిగ్రీ ఇన్‌స్టంట్ ఫలితాల విడుదల

అనంతపురం: డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఫలితాలను ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి. అనిత సోమవారం విడుదల చేశారు. శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ 6 సెమిస్టర్‌లో ఒక సబ్జెక్టు ఫెయిల్ అయిన వారికి ఆదివారం పరీక్ష నిర్వహించారు. పరీక్ష నిర్వహించిన 24 గంటల్లోనే ఫలితాలు ప్రకటించారు. మొత్తం 324 మంది పరీక్ష రాయగా, 319 మంది ఉత్తీర్ణులయ్యారు. కేవలం ఐదుగురు ఫెయిల్ అయ్యారు.

క్లుప్తంగా

'పీఏబీఆర్'లోకి తుంగభద్ర జలాలు



పీఏబీఆర్ డ్యాం వైపుగా వెళుతున్న తుంగభద్ర జలాలు

కూడేరు: మండలంలోని పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్)లోకి సోమవారం తుంగభద్ర జలాలు చేరుకున్నాయి. హెచ్చెల్సీ ద్వారా 355 క్యూసెక్కుల నీరు డ్యాంలోకి చేరుకుంటున్నట్లు నీటి పారుదల శాఖ జేఈఈ లక్ష్మీదేవి తెలిపారు. రిజర్వాయర్‌లో ప్రస్తుతం 0.452 టీఎంసీల నీరు నిల్వ ఉంది. శ్రీసత్యసాయి, శ్రీరామరెడ్డి, అనంతపురం, ఉరవకొండ, కూడేరు తాగునీటి ప్రాజెక్టులకు రోజుకు 55 నుంచి 65 క్యూసెక్కుల వరకూ నీటిని విడుదల చేస్తున్నారు.

డీలర్ల తొలగింపునకు కుట్ర

- రాజీనామా చేయకుండా ఉన్న డీలర్లను ఇరుకున పెట్టే యత్నం
- ఒత్తిళ్లకు తలొగ్గిన అధికారులు
- తక్కువ బరువున్న రేషన్ బియ్యం బస్తాల సరఫరా
- తూకాల్లో మోసమంటూ కేసుల నమోదుకు పన్నాగం

తాడిపత్రి రూరల్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పారదర్శక పాలన కనుమరుగవుతూ వస్తోంది. వ్యవస్థలను మేనేజ్ చేసేందుకు స్థానిక టీడీపీ నేతలు పావులు కదుపుతుండడంతో అధికారులు సైతం జీ హుజూర్ అంటున్నారు. ఈ క్రమంలో తాజాగా రేషన్ డీలర్ షిప్పులపై కన్నేసిన టీడీపీ నేతలు ఇప్పటికే ఆయా స్థానాలను స్వచ్ఛందంగా వదిలి వెళ్లాలని హుకుం జారీ జేశారు. కాదూకూడదని అలాగే కొనసాగుతున్న డీలర్లను ఇరుకున పెట్టే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇందుకు అధికారులు వత్తాసు పలికి తక్కువ బరువున్న బియ్యం బస్తాలను డీలర్లకు అందజేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో తనిఖీలు చేపట్టి తూకాల్లో మోసాలకు పాల్పడ్డారంటూ డీలర్లపై కేసుల నమోదుకు కుట్ర పన్నారు.

గోదాములోనే తోడేసి...

తాడిపత్రిలోని గోదాము నుంచి ప్రతి నెలా 12,218 క్వింటాళ్ల బియ్యం సరఫరా జరుగుతోంది. తాడిపత్రి పట్టణ, మండలంలోని 94మంది డీలర్లకు 7,500 క్వింటాళ్లు, పుట్లూరు మండలం 1,645 క్వింటాళ్లు, యల్లనూరు మండలం 1,543 క్వింటాళ్లు, పెద్దపప్పూరు మండలం 1,530 క్వింటాళ్ల చొప్పున సరఫరా చేయాల్సి ఉంది. అయితే దాదాపు 180 క్వింటాళ్లకు పైగా బియ్యాన్ని గోదాము అధికారితో పాటు సిబ్బంది పక్కదారి పట్టించినట్లుగా ఆరోపణలున్నాయి. బయటి మార్కెట్‌లో ఎంత లేదన్నా స్టోర్ బియ్యం కిలో రూ.14తో విక్రయిస్తున్నారు. ఈ లెక్కన 180 క్వింటాళ్లకు రూ.2.52 లక్షలు స్వాహాకు రంగం సిద్ధం చేసినట్లుగా తెలుస్తోంది. సాధారణంగా పౌర సరఫరాల సంస్థ నుంచి 50 కిలోల బస్తాలో 300 గ్రాముల బియ్యం అదనంగా ఉంటాయి. ఈ అదనపు బియ్యానికి తోడు మరో మూడు కిలోల మేర తోడేసి డీలర్లకు సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. టీడీపీ నాయకుల ఒత్తిళ్లకు తాళలేక అధికారులే ఈ కుట్రను స్వాగతించినట్లుగా ఆరోపణలున్నాయి.

అప్రమత్తమైన డీలర్లు

టీడీపీ నేతల కుట్రలను ముందుగానే పసిగట్టిన తాడిపత్రికి చెందిన పలువురు డీలర్లు అప్రమత్తమయ్యారు. ఆగస్టు 1వ తేదీన కార్డుదారులకు బియ్యం పంపిణీ చేయాల్సి ఉండడంతో స్టాక్‌ను ఆయా డీలర్లకు సోమవారం అందజేశారు. ఈ క్రమంలో 50 కిలోల కంటే తక్కువ తూకం ఉన్న రేషన్ బస్తాలను డీలర్లు గుర్తించి వెంటనే తిరస్కరిస్తూ వచ్చారు. లారీ వద్దనే కాటా వేసి తక్కువ స్టాక్ ఉన్న బస్తాలను గుర్తించి నిలదీస్తుండడంతో అధికారులు సమాధానం చెప్పుకోలేక పోయారు. కుట్ర బహిర్గతం కావడంతో ఏం చేయాలో తెలియక గోదాము అధికారితో పాటు రెవెన్యూ అధికారులూ సతమతమయ్యారు.



బియ్యం బస్తాలను డీలర్‌కు దించుతున్న హమాలీలు

తూకాల్లో తేడాలున్నాయి

గోదాము నుంచి మాకు అందజేస్తున్న బస్తాలు తూకం తక్కువతో ఉంటున్నాయి. దీంతో అనుమానం వచ్చి లారీ వద్దనే కాటా వేయించాం. 50 కిలోల బస్తాలో మూడు కిలోల బియ్యం తక్కువగా ఉండడం బయటపడింది. దీంతో ఆ బస్తాలను వెంటనే తిరస్కరించాం. తూకాలు సక్రమంగా ఉంటేనే తీసుకుంటామని అధికారులకు తెలిపాం. – వేణు, డీలర్

కఠిన చర్యలు తీసుకుంటాం

తాడిపత్రి గోదాము నుంచి డీలర్లకు సరఫరా అవుతున్న బియ్యం బస్తాల్లో తక్కువ తూకం ఉన్నట్లుగా నిర్ధారణ అయితే కఠిన చర్యలు తప్పవు. తూకాల్లో జరుగుతున్న మోసంపై విచారణ జరుపుతాం. ఇప్పటికే తూకాలు తక్కువగా ఉన్నాయంటూ చాలా మంది డీలర్లు బియ్యం బస్తాలను తిరస్కరిస్తున్నట్లుగా సమాచారం అందింది. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.
– రమేష్‌రెడ్డి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్, అనంతపురం

పోలీసుల సమక్షంలోనే తన్నుకున్న టీడీపీ నేతలు



గుంపును చెదరగొడుతున్న పోలీసులు

ఉరవకొండ: స్థానిక పోలీస్టు స్టేషన్ ఎదుటనే టీడీపీ నేతలు బాహాబాహీకి దిగారు. పరస్పర దాడులతో రెచ్చిపోయారు. వివరాలు.... ఉరవకొండ మండలం నింబగల్లు వద్ద ఉన్న సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ పరిశీలనకు సోమవారం ఉదయం మంత్రి పయ్యావుల కేశవ్ వెళ్లారు. అనంతరం కొనకొండ్లకు వెళుతున్న మంత్రి కాన్వాయ్ వెంట వాహనాల్లో టీడీపీ నేతలూ అనుసరించారు. ఉరవకొండలోని పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకోగానే ఎదురుగా వెళుతున్న వై.రాంపురం గ్రామ టీడీపీ నేత సంజీవరాయుడు వాహనాన్ని వెనుకనే ఉన్న అదే గ్రామానికి చెందిన మరో టీడీపీ నేత వాహనం ఢీకొంది. ఆ సమయంలో వాహనాలను ఆపి ఇరువర్గాల నాయకులు వాదులాటకు దిగారు. వారి అనుచరుల మధ్య తోపులాట జరిగింది. అదే సమయంలో లత్తవరం గ్రామ మాజీ సర్పంచ్ గోవిందు కలుగజేసుకుని నడి రోడ్డు మీద తోపులాటకు దిగిన టీడీపీ నాయకులను సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. దీంతో సంజీవరాయుడు వర్గం గోవిందుపై తిరగబడింది. వెంటనే గోవిందు అనుచరులు వారితో కలబడ్డారు. పరస్పర దాడులతో ఆ పరిసరాల్లో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు జోక్యం చేసుకుని సర్దిచెప్పి ఇరువర్గాలను అక్కడి నుంచి సాగనంపారు.

'ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ఎంపిక విధానం మారాలి'

అనంతపురం ఎడ్యుకేషన్: రాష్ట్ర, జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ఎంపిక విధానంలో మార్పులు చేయాలని ఏపీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపల్లి విజయ్‌భాస్కర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్‌కు ఆయన లేఖ రాశారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఉపాధ్యాయులే స్వయంగా దరఖాస్తు చేసుకునే విధానం కాకుండా విద్యాశాఖ సీనియర్ అధికారులతో క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయించి, వృత్తిపట్ల అంకిత భావంతో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ప్రతిపాదించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంతోమంది అంకిత భావం, విలువలతో కూడిన విద్యను అందించేందుకు శ్రమిస్తున్న ఉపాధ్యాయులు ఉన్నారని గుర్తు చేశారు. వారందరినీ గుర్తించి గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సమాజంలో రాజకీయ పలుకుబడి ఉన్న ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు బలపరిచిన ఉపాధ్యాయులకు మాత్రమే ఇప్పటి వరకూ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ఇస్తున్నారనే భావన సామాన్య ఉపాధ్యాయుల్లోనూ ఉందన్నారు. దీంతో ఉపాధ్యాయులే స్వయంగా దరఖాస్తు చేసుకునే విధానానికి స్వస్తి పలకాలని సూచించారు.

1 నుంచి తల్లిపాల వారోత్సవాలు

అనంతపురం సెంట్రల్: జిల్లా వ్యాప్తంగా ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకూ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీడీ శ్రీదేవి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

రాష్ట్రంలో అరాచక పాలన

- ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి ధ్వజం



ఉరవకొండ: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత హత్యలు, దాడులు, దౌర్జన్యాలు, విధ్వంసాలు పెరిగిపోయాయని, చంద్రబాబు అరాచక పాలన పరాకాష్టకు చేరుకుందని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి ధ్వజమెత్తారు. వజ్రకరూరు మండలం కొనకొండ్లలోని తన స్వగృహంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం... అధికారం చేపట్టిన తర్వాత వాటిని విస్మరించడం చంద్రబాబుకు అలవాటేనన్నారు. తాజాగా గత ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను తుంగలో తొక్కి తన నైజాన్ని చంద్రబాబు మరోసారి బయట పెట్టుకున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే మొదటగా రాష్ట్రం ఆర్థికంగా నాశనమైందని, దీంతో సూపర్‌సిక్స్ అమలు చేయాలంటే భయమేస్తోందని తన తొలి కథను వినిపించారన్నారు. ఎన్నికలకు ముందు రాష్ట్రానికి రూ.14లక్షల కోట్ల అప్పులున్నాయంటూ ఊదరగొట్టిన చంద్రబాబు... సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత లెక్కలు చూసి, రూ.14లక్షల కోట్లను రూ.10లక్షల కోట్లకు మార్చి అసెంబ్లీ సాక్షిగా గవర్నర్ చేత అబద్ధం కూడా చెప్పించారన్నారు. 2019 మే 30న వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టేసరికి రాష్ట్ర ఖజానాలో కేవలం రూ.100 కోట్లు మాత్రమే ఉన్నాయని గుర్తు చేశారు. అయినా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వారం రోజుల్లోనే పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని గుర్తుచేశారు. ఐదేళ్లలో పేదల ఖాతాలో రూ.2.71 లక్షల కోట్ల లబ్ధిని నేరుగా వారి ఖాతాల్లో జమ చేసిందన్నారు. ప్రస్తుతం చంద్రబాబు ప్రభుత్వం పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టకుండా మరో 3 నెలల పాటు ఓటాన్ అకౌంట్‌కు వెళ్లడం సిగ్గుచేటన్నారు. న్యాయబద్ధంగా పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిది కాగా, కమీషన్ల కక్కుర్తితో 2013–14లో రూ.20,398 కోట్లకే నిర్మాణాన్ని పూర్తి చేస్తామని అప్పటి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో చంద్రబాబు లాలూచీ పడింది నిజం కాదా అని ప్రశ్నించారు. ఇదే అంశంపై అప్పట్లో ప్రధాని మోదీ సైతం మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్ట్ చంద్రబాబుకు ఏటీఎం లాంటిదని చెబుతూ ఎద్దేవా చేశారని గుర్తు చేశారు. అస్మదీయ కంపెనీలకు నామినేషన్ పద్ధతిలో కాంట్రాక్ట్‌లిచ్చి నిధులు దోచుకుని ప్రాజెక్ట్ నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. 2014–19 మధ్య కాలంలో ఇసుక విధానంపై టీడీపీ ప్రభుత్వం 19 జీఓలు తెచ్చి భారీగా దోపిడీకి పాల్పడిందనే విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలుసునన్నారు. తాజాగా ఉచిత ఇసుక పేరుతో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు ఏకమై సొంత ఖజానాలు నింపుకుంటున్నారన్నారు. ఇప్పటికైనా గత ప్రభుత్వ చిత్తశుద్ధిపై నిందలు వేయడం మాని ప్రజా సంక్షేమంపై దృష్టి సారించాలని చంద్రబాబు ప్రభుత్వానికి హితవు పలికారు.

వైఎస్సార్‌సీపీ నేతపై దాడి



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

కణేకల్లు: మండలంలోని మాల్యం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత మద్రేగౌడ్‌పై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారు. పక్కాప్లాన్ ప్రకారం ఆదివారం అర్ధరాత్రి ఇంట్లోకి చొరబడిన ముగ్గురు ఆగంతకులు తొలుత మద్రేగౌడ్‌పై కర్రలతో దాడి చేశారు. ఆ సమయంలో ఇంట్లో ఉన్న మద్రేగౌడ్ సోదరుడు కరిబసి, ఆయన భార్య యశోద, తల్లి లక్ష్మీదేవి, పెద్దమ్మ నీలమ్మ ఎదురుదాడికి దిగారు. దుండగులను ఇంట్లో బంధించే యత్నం చేశారు. దీంతో అప్రమత్తమైన బయట ఉన్న వ్యక్తి అందరినీ వెంటనే అక్కడి నుంచి దుండగులను పిలుచుకెళ్లాడు. కాగా, వెళుతూ... ఎప్పటికైనా మద్రేగౌడ్‌ను హతమారుస్తామంటూ బెదిరించారు. ఘటనపై సోమవారం ఉదయం పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారి వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, పట్టణ కన్వీనర్ టి.కేశవరెడ్డి, మాజీ సర్పంచ్ పాటిల్ బ్రహ్మానందరెడ్డి, నాయకులు ఇమాంవలీ, తిప్పారెడ్డి, ఖాదర్, భాస్కర్‌రెడ్డి, హనుమంతరావు, లోకేష్ గౌడ్ ఉన్నారు. దుండగులు ఓ కారులో వచ్చి దాడి చేసినట్లుగా వివరించారు.

'పోలీసు స్పందన'కు 117 వినతులు



దివ్యాంగులతో వినతులు తీసుకుంటున్న ఎస్పీ

అనంతపురం: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 117 వినతులు అందాయి. ఎస్పీ కేవీ మురళీకృష్ణ నేరుగా వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఆర్.విజయభాస్కర్ రెడ్డి, జి.రామకృష్ణ, డీఎస్పీ టీవీవీ ప్రతాప్, ఎస్‌బీ సీఐ ఇందిర తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోంది

- ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై తప్పుడు ప్రచారం
- రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



రాప్తాడు రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో జరుగుతున్న హత్యలు, దాడులు, దౌర్జన్యాలు, విధ్వంసాలు చూస్తే రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేసినట్లుగా కనిపిస్తోందని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మండిపడ్డారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. చంద్రబాబు అరాచక పాలనపై ప్రజలెవ్వరూ ప్రశ్నించకుండా ప్రభుత్వం అణచివేస్తోందన్నారు. రెడ్‌బుక్‌లో పేర్లున్న వారిని టార్గెట్ చేసి, దాడులకు ప్రేరేపిస్తున్నారన్నారు. చంద్రబాబు, లోకేష్ కనుసన్నల్లోనే విధ్వంసాలు సాగుతున్నాయని ధ్వజమెత్తారు. సీఎం చంద్రబాబు ప్రభుత్వం పూర్తిస్థాయిలో బడ్జెట్‌ను ప్రవేశ పెట్టకుండా మరో 3 నెలలు ఓటాన్ అక్కౌంట్ వెళ్లడం సిగ్గుచేటన్నారు. గతంలో ఎన్నడూ ఇలాంటివి చూడలేదన్నారు. 2019 మే 30న తాము అధికారంలోకి వచ్చేటప్పటికి రాష్ట్ర ఖజానాలో కేవలం రూ.100 కోట్లు ఉందన్నారు. అంతటి కష్టంలోనూ 2019 జూలై 12న రాష్ట్రంలో పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టామని గుర్తు చేశారు. కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ ఎక్కడేగాని సంక్షేమాన్ని ఆపలేదన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ పాలన ఉండి ఉంటే ఇప్పటికే 'అమ్మ ఒడి' పథకం వర్తించి ఉండేదన్నారు. పిల్లలను బడికి పంపే ప్రతి తల్లికీ ఈ పథకం కింద గత నాలుగేళ్లలో రూ.26,067 కోట్ల సగటున ఏటా 43 లక్షల మంది తల్లులకు ఇచ్చామన్నారు. అలాగే ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ ఉండి ఉంటే రైతుభరోసా సకాలంలో రైతుల ఖాతాల్లో జమ అయ్యేదన్నారు. ఈ ఏడాది మార్చిలో ఎన్నికల కోడ్ కారణంగా ఉచిత పంట లబీమా ప్రీమియం చెల్లింపు వాయిదా పడిందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కట్టాల్సి ఉన్నా ఇప్పటి వరకూ అతీగతీ లేకుండా పోయిందన్నారు. ల్యాండ్ రీసర్వే, టైటిలింగ్ యాక్ట్‌పై తప్పుడు ప్రచారం చేసి, దానిని రద్దు చేసినట్లుగా సీఎం చంద్రబాబు నాటకాలు ఆడుతున్నారని మండిపడ్డారు. ఇది తప్పుడు చట్టం అని కేంద్రంతో చెప్పించగలిగే దమ్ము చంద్రబాబుకు ఉందా అని ప్రశ్నించారు. వాస్తవానికి ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ అమలుపై ఆ రోజు అసెంబ్లీ సాక్షిగా చర్చకు పెడితే టీడీపీ శాసనసభ్యులే స్వాగతించారని గుర్తు చేశారు. వలంటీర్లకు రూ.10 వేలు ఇస్తానంటూ ఎన్నికల సమయంలో హామీనిచ్చి, అధికారం చేపట్టిన తర్వాత వారిని రోడ్డున పడేశారన్నారు. పాత పద్ధతిలోనే ఫీజు రీయింబర్స్‌మెంట్ అంటూ కత్తిరింపులు ఉంటాయని చెప్పకనే చెప్తున్నారన్నారు.

ప్రభుత్వ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ



పోస్టర్లను విడుదల చేస్తున్న రామకృష్ణ, తదితరులు

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రభుత్వ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులు, కాస్మెటిక్ చార్జీలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఆగస్టు 1 నుంచి జిల్లా వ్యాప్తంగా చేపట్టబోయే జీపు జాతను జయప్రదం చేయాలంటూ ముద్రించిన పోస్టర్లను సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ.... ఆరు నెలలుగా మెస్ బిల్లులు, కాస్మొటిక్ చార్జీలు అందక హాస్టల్ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వ హాస్టళ్లకు వెంటనే కొత్త భవనాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు జీఓ 77ను వెంటనే రద్దు చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విశ్వవిద్యాలయాలు, డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర పోస్టులు భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు రామచంద్రయ్య, రాష్ట్ర యువజన మాజీ నాయకులు జాఫర్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ నాయకులు నారాయణస్వామి, సంజీవప్ప, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయిస్వామి, పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేయాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎండీ సంతోషరావు

తిరుపతి రూరల్: నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేయడమే లక్ష్యంగా పనిచేయాలని ఉద్యోగులను ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు ఆదేశించారు. తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం నుంచి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉమ్మడి చిత్తూరు, అనంతపురం, కర్నూలు, కడప, నెల్లూరు జిల్లాల పరిధిలోని అధికారులతో ఆయన సమీక్షించారు. ఫీడర్ ట్రిప్పింగ్, బ్రేక్ డౌన్‌ను పూర్తిస్థాయిలో నిరోధించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ బకాయిలను వసూలు చేసేందుకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. విద్యుత్ అంతరాయాలు, సమస్యలపై టోల్ ఫ్రీ నంబర్లు 1912, 1800 425 155333కు కాల్ చేయాలని, చాట్ బోట్, 91333 31912 నంబరుతో వాట్సాప్ ద్వారా అధికారుల దృష్టికి సమస్య తీసుకురావడం ద్వారా వాటిని త్వరితగతిన పరిష్కరించుకోవచ్చునని సూచించారు. వినియోగదారులకు సేవలందించడంలో అలసత్వం వహించే అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్లు ధర్మజ్ఞాని, పద్మ, సూపరింటెండింగ్ ఇంజనీర్లు సురేంద్ర నాయుడు, విజయన్, రమణ, ఉమాపతి, సంపత్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అకౌంట్స్ విభాగపు అధికారులు పాల్గొన్నారు.

విద్యాదాఘాతంతో రైతు మృతి



మృతుడు హరినాథరెడ్డి

పెద్దపప్పూరు: పొలం దుక్కి చేస్తున్న సమయంలో విద్యుత్ షాక్‌కు గురై ఓ రైతు మృతి చెందాడు. వివరాలు.. పెద్దపప్పూరు మండలం చెర్లోపల్లికి చెందిన హరినాథరెడ్డి (42)కి భార్య, హరిత, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వ్యవసాయంతో కుటుంబాన్ని పోషించుకునే హరినాథ్‌రెడ్డి సోమవారం ఉదయం తన స్నేహితుడు గోపాల్‌తో కలసి పొలంలో దుక్కి పనులు చేపట్టాడు. ఆ సమయంలో తుప్పు పట్టిన ఇనుపపైప్ మడకకు తగలడంతో దానిని వెలికి తీశారు. దాదాపు 20 అడుగుల పొడవున్న పైపును హరినాథరెడ్డి పైకి ఎత్తిన సమయంలో విద్యుత్ ప్రధాన లైన్‌కు తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. గోపాల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ గౌస్‌బాషా, విద్యుత్ శాఖ ఏఈ నరసింహ అక్కడకు చేరుకుని పరిశీలించారు. క్షతగాత్రుడిని తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి

అనంతపురం సెంట్రల్: ప్రస్తుత సీజన్‌లో రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయడంపై దృష్టి సారించాలని వ్యవసాయశాఖ ఏడీఏ రవి సూచించారు. సోమవారం స్థానిక ఏడీ కార్యాలయంలో అనంతపురం, రాప్తాడు, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, కూడేరు, ఆత్మకూరు మండలాల వ్యవసాయ అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రత్యామ్నాయ పంటల సాగుకు విత్తనాలు ఏయే మండలాలకు ఎంత అవసరం ఉందో అడిగి తెలుసుకున్నారు. అలాగే మట్టి నమూనాల సేకరణ లక్ష్యాలు, ప్రగతి, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, పొలంబడి నిర్వహణ తదితర అంశాలపై సమీక్షించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు శశికళ, సోమశేఖర్, సుచరిత, శ్యాంసుందర్ రెడ్డి, శేఖర్‌రెడ్డి, ఏఈఓలు మురళీకృష్ణ, సుజిత, అలేఖ్య, శిరీష, రంజిత రాణి, శైలజ, స్రవంతి, ఆత్మ ఏటీఎం అనురాధ తదితరులు పాల్గొన్నారు.

కరి నరసింహారావు సేవలు ప్రశంసనీయం



కరి నరసింహా రావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

అనంతపురం: విశ్వ ఉద్యోగి మాస పత్రిక ప్రచురణలో విశేష కృషి చేసిన బోధనేతర సంఘం నేత కరి నరసింహా రావు మృతి తీరని లోటని ఎస్కేయూ బోధనేతర సంఘం నాయకులు పేర్కొన్నారు. కరి నరసింహారావు ఆదివారం మరణించిన విషయం తెలిసిందే. సోమవారం ఎస్కేయూ బోధనేతర సంఘం కార్యాలయంలో కరి నరసింహారావు సంతాప సభను ఎస్కేయూ బోధనేతర సంఘం అధ్యక్షుడు టి.ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో బోధనేతర సంఘం నాయకులు ఎం.తిమ్మప్ప, ఓబులేసు, కవిరాజు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఎస్పీ

అనంతపురం టవర్‌క్లాక్: స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సోమవారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలమొక్క అందజేశారు. జిల్లాలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. అనంతరం మంత్రి వైద్యా ఆరోగ్య శాఖ కార్యలయానికి తరలివెళ్లారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ పాల్గొన్నారు.

హ్యూమిక్ యాసిడ్ పట్టివేత

అనంతపురం అగ్రికల్చర్: కర్ణాటక నుంచి అక్రమంగా తీసుకొచ్చిన హ్యూమిక్ యాసిడ్‌ను వ్యవసాయశాఖ అధికారులు గుర్తించి సీజ్ చేశారు. అనంతపురంలోని ఆర్టీసీ బస్టాండ్ వెనుక ఎస్‌ఆర్‌ఎంటీ ట్రాన్స్‌పోర్టు ఏజెన్సీకి చెందిన లారీలో గుట్టుచప్పుడు కాకుండా హ్యూమిక్ యాసిడ్‌ను అక్రమంగా దిగుమతి చేస్తున్నారన్న సమాచారం రావడంతో అనంతపురం ఏడీఏ రవి, ఏఓ శశికళ ఆకస్మిక తనిఖీ చేపట్టారు. రూ. 2.40 లక్షల విలువ చేసే దాదాపు వెయ్యి లీటర్ల యాసిడ్‌కు సంబంధించి ఎలాంటి అనుమతి లేదని నిర్ధారించుకుని డిటెన్షన్ (నిలుపుదల) చేస్తూ ట్రాన్స్‌పోర్టు నిర్వాహకులను ఆదేశించారు.


భాష్యంలో ఫ్రెషర్స్ డే



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక జీసస్ నగర్‌లోని భాష్యం పాఠశాలలో సోమవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ విష్ణు భాస్కర్, డాక్టర్ రమ్య తేజ హాజరయ్యారు. విద్యార్థులకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, చదువు ప్రాముఖ్యత తెలియజేశారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థినుల కరాటే ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో భాష్యం విద్యా సంస్థల అనంతపురం జిల్లా జెడ్ఈఓ రవివర్మ, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, హెచ్‌ఎం, సిబ్బంది పాల్గొన్నారు.

డ్యూయల్ డిగ్రీకి 13 అడ్మిషన్లు



అడ్మిషన్ పొందిన విద్యార్థులతో జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కృష్ణయ్య

అనంతపురం: జేఎన్‌టీయూ(ఏ), బ్లెకింగ్ వర్సిటీ (స్వీడన్) డ్యూయల్ డిగ్రీ కోర్సుకు 13 మంది విద్యార్థులు అడ్మిషన్ పొందారు. అర్హత సాధించిన విద్యార్థులకు అడ్మిషన్ పత్రాలను సోమవారం రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య అందజేశారు. బీటెక్ కోర్సులో మూడేళ్లు జేఎన్‌టీయూ క్యాంపస్ కళాశాలలో, చివరి సంవత్సరం స్వీడన్‌లో వీరు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఎంఎస్ ప్రోగ్రాంను స్వీడన్‌లో చేయవచ్చు. కార్యక్రమంలో ఫారిన్ ఎఫైర్స్ డీన్ ప్రొఫెసర్ పి.సుజాత, అడ్మిషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్.కిరణ్మయి పాల్గొన్నారు.

అమ్మపాలే అమృతం

- బిడ్డకు పాలిస్తే తల్లికీ ఆరోగ్యం
- చిన్నారుల్లో రోగ నిరోధక శక్తి మెరుగు
- ఆగస్టు 1 నుంచి 7 వరకూ తల్లిపాల వారోత్సవాలు

రాప్తాడు: అమ్మ అనే పదంలోనే ఆప్యాయత, అనురాగం, మురిపం అనే సుగుణాలు మిళితమై ఉన్నాయి. పుట్టిన బిడ్డకు తొలి ఆహారం, తొలిటీకా తల్లిపాలు. తల్లిపాలే పిల్లలకు అమృతం. బిడ్డ శారీరక ఎదుగుదలకు తల్లిపాలు ఎంతగానో దోహదపడతాయి. నవజాత శిశువుకు బలం చేకూర్చే ఆహారం తల్లిపాలే అని నిపుణులు చెబుతున్నారు. నూరు శాతం పోషక విలువలున్న తల్లిపాలు శిశువు ఆరోగ్యంగా ఎదగడంలో, ఆయుష్షు పెంచడంలో కీలకపాత్ర పోషిస్తాయి. అయితే ఈ విషయం తెలిసినా చాలా మంది తల్లులు పిల్లలకు ముర్రుపాలు ఇచ్చేందుకు ఇష్టపడటం లేదు. అపనమ్మకం, అభద్రతా భావం, కారణం ఏదైతేనేం బిడ్డకు పాలు అందించేందుకు అయిష్టత చూపుతున్నారు. ఫలితంగా పిల్లల్లో రోగనిరోధక శక్తి తగ్గి భవిష్యత్తులో వ్యాధుల బారిన పడే అవకాశం లేకపోలేదు. తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తూ ప్రభుత్వం ఏటా వారోత్సవాలు నిర్వహిస్తోంది. ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి తెలిపారు. ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల ఆవశ్యకతను అంగన్‌వాడీ వర్కర్లు వివరిస్తారని పేర్కొన్నారు.

ఆరు నెలల పాటు తల్లిపాలే ఆహారం..

బిడ్డ పుట్టిన వెంటనే తప్పనిసరిగా తల్లిపాలు పట్టించాలి. ఆరు నెలల పాటు తల్లిపాలను మాత్రమే ఆహారంగా ఇస్తే బిడ్డకు తేలికగా జీర్ణమవుతుంది. తల్లిపాలు శుభ్రంగా ఎలాంటి క్రిములు లేకుండా ఉంటాయి. శ్వాసకోశ, అలర్జీ, ఆస్తమా, చర్మ వ్యాధుల నుంచి పిల్లలను రక్షిస్తాయి. బిడ్డ మానసిక, శారీరక వికాసానికి అవసరమైన పోషకాలు అందిస్తాయి. రోజులో బిడ్డకు 8–10 సార్లు పాలు ఇవ్వాలి. ఆరు మాసాల తర్వాత నుంచి బిడ్డకు తల్లిపాలతో పాటు అనుబంధ ఆహారం ఇవ్వాలి. రెండేళ్ల వరకు క్రమం తప్పకుండా పాలు పట్టాలి.

ముర్రుపాలతో వ్యాధి నిరోధక శక్తి..

కాన్పు అయిన మొదటి కొద్ది రోజులు తల్లిపాలు చిక్కగా, పసుపు రంగులో ఉంటాయి. వీటినే ముర్రుపాలు అంటారు. ఇందులో ప్రొటీన్లు అధికంగా ఉంటాయి. వీటిలో రోగాలను ఎదుర్కొనే శక్తిని పెంచే గుణం ఉంటుంది. అలాగే విటమిన్ ఏ, బీలతో పాటు తగినంత ఐరన్ కూడా ఉంటుంది. ముర్రుపాలతో శిశువులు చక్కగా పెరుగుతారు. అప్పుడే పుట్టిన బిడ్డకు పేగులకు బలాన్ని ఇచ్చి, జీర్ణశక్తిని పెంచేందుకు తోడ్పడతాయి. కామెర్లు, విరేచనాల వంటి ప్రమాదకరమైన రోగాల నుంచి కాపాడతాయి.

బోలెడు ప్రయోజనాలు

- తల్లి పాలలో ప్రొటీన్లు లాక్టోఫెరిన్, కోలోస్ట్రమ్, కొన్ని కీలకమైన హార్మోన్లు, రోగ నిరోధక బ్యాక్టీరియా ఉంటాయి.
- తల్లిపాలు తాగే పిల్లలు ఎక్కువగా బలంగా ఉంటారు. వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుంది. తెలివి తేటలు ఎక్కువగా ఉంటాయి. డబ్బా పాలు తాగే పిల్లల కంటే చురుగ్గా ఉంటారు.
- బిడ్డకు పాలు ఇవ్వడం ద్వారా తల్లీబిడ్డల మధ్య అనుబంధం పెనవేసుకుంటుంది.
- తల్లిపాలు తేలికగా జీర్ణమవుతాయి. ఎలాంటి క్రిములు లేకుండా ఉంటాయి.
- తల్లిపాలు తాగే బిడ్డ దవడలు బాగా బలపడతాయి.
- పాలిచ్చే తల్లులకు నెలసరిలో రక్తస్రావం కూడా తక్కువగా ఉంటుంది. పాలిచ్చినంత కాలం మళ్లీ గర్భం రాకుండా గర్భనిరోధకంగా కూడా పనిచేస్తుంది.
- పాలిచ్చే తల్లులకు రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లు రావు.
- బిడ్డకు రోజుకు కనీసం 8 నుంచి 10 సార్లు పాలు ఇవ్వాలి.

చేయకూడనివి

- పంచదార నీళ్లు, తేనె, ఆవు పాలు, మేక పాలు, వస, గోమూత్రం బిడ్డకు పట్టకూడదు.
- ఆరు నెలల పూర్తయ్యే వరకు బిడ్డకు తినడానికి, తాగడానికి ఏమీ ఇవ్వకూడదు. ఏ రుతువులోనైనా నీళ్లు పట్టనక్కర్లేదు.
- సీసా పాలు కూడా పట్టకూడదు.



తల్లిపాల వారోత్సవాల పోస్టర్

బాధ్యతగా భావించాలి



ముర్రుపాలు పట్టించడం భారం అనుకోవద్దు. పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రుపాలు పట్టించాలి. 6 నెలల వరకు తల్లిపాలు మాత్రమే తాపించాలి. తల్లికి అన్ని రకాల ఆహారం పెట్టాలి. 6 నెలల తర్వాత తల్లిపాలతో పాటు ఇంట్లో తినే ఆహారం మాత్రమే ఇవ్వాలి. బిడ్డకు 2 సంవత్సరాల పాటు తల్లి పాలు కొనసాగించాలి. ముర్రుపాలు బిడ్డకు అమృతం లాంటివి. తల్లిపాల ఆవశ్యకతను తెలియజేసేందుకు ఏటా తల్లిపాల వారోత్సవాలను ఆగస్టు మొదటి వారంలో నిర్వహిస్తాం. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు స్థానిక వైద్య సిబ్బంది తల్లిపాల విశిష్టతను తెలియజేస్తూ ర్యాలీ, అవగాహన సదస్సులు నిర్వహిస్తాం. జిల్లా వ్యాప్తంగా ఉన్న 2,302 అంగన్‌వాడీ కేంద్రాల్లో 7 రోజుల పాటు తల్లిపాల వారోత్సవాలు జరుగుతాయి.

– బీఎన్ శ్రీదేవి, ఐసీడీఎస్, పీడీ

ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దు

ఆత్మకూరు: ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారి సబిహా సుల్తానా తెలిపారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు సోమవారం స్థానిక వైద్య సిబ్బందితో కలిసి కస్తూర్బా పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేసి, అందరూ ఆరోగ్యంగా ఉన్నట్లు పేర్కొన్నారు. చిన్న జబ్బులు ఉన్న వారికి తగిన మాత్రలు అందించినట్లు తెలిపారు.

ఎరుకలకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

అనంతపురం టవర్‌క్లాక్: ఎరుకల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా ఎరుకల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఎరుకల ప్రజా పోరాట సమితి రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు గుజ్జల ముత్యాలమ్మ సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్య, వైద్యం, ఆర్థికంగా వెనుకబడిన ఎరుకులకు ఆర్థిక సహకారం అందించాలన్నారు.

మార్కెట్ యార్డు కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఎన్నిక

అనంతపురం సెంట్రల్: మార్కెట్ యార్డు కమిటీల కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అసోషియేషన్ రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని సోమవారం ప్రకాశం జిల్లా దర్శి మార్కెట్‌యార్డులో ఎన్నుకున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి నలుగురు సభ్యులకు అవకాశం దక్కింది. వర్కింగ్ కార్యదర్శిగా సుధాకర్‌యాదవ్ (ఉరవకొండ), ఉపాధ్యక్షుడిగా మారెన్న(అనంతపురం), సహాయ కార్యదర్శిగా ఈశ్వరయ్య (రాయదుర్గం), కార్యవర్గ సభ్యుడిగా ఆదినారాయణ (హిందూపురం)ను ఎన్నుకున్నారు.

బలిజ మహా సంఘం నూతన అధ్యక్షుడిగా శంకరయ్య

అనంతపురం టవర్‌క్లాక్: రాయలసీమ బలిజ మహా సంఘం నూతన అధ్యక్షుడిగా శంకరయ్యను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శంకరయ్య మాట్లాడుతూ.. బలిజ కులస్తుల అభ్యున్నతికి కృషి చేస్తానని తెలిపారు. జిల్లాలో సంఘాన్ని బలోపేతం చేస్తామన్నారు. తన ఎంపికకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

కమ్యూనిటీ హాల్ నిర్మించాలి



ఎమ్మెల్యే సునీతతో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి పంచాయతీ పరిధిలోని ప్రజాశక్తి నగర్‌లో పుచ్చలపల్లి సుందరయ్య పేరుతో కమ్యూనిటీ హాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతకు సీపీఎం నాయకులు విన్నవించారు. ఈ మేరకు సోమవారం సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, నగర కార్యదర్శి ఆర్వీ నాయుడు, లక్ష్మీనారాయణ, శీనా, ఇర్ఫాన్ తదితరులు ఎమ్మెల్యే పరిటాల సునీతను కలిశారు. సీపీఎం ఆధ్వర్యంలో 17 ఏళ్ల కిందట ప్రజాశక్తి నగర్ ఏర్పాటైందని రాంభూపాల్ వివరించారు. ప్రజా అవసరాల రీత్యా కొంతస్థలం కేటాయించామని పేర్కొన్నారు. అందులో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే కాలనీలో అర్థాంతరంగా ఆగిపోయిన అంగన్‌వాడీ భవన నిర్మాణం పూర్తి చేసేలా చూడాలని కోరారు. ఈ కాలనీలో రేషన్ షాపు ఏర్పాటు చేయాలన్నారు.

ఐక్యూఏసీ నూతన డైరెక్టర్‌గా ప్రొఫెసర్ వెంకటరమణ

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం నూతన ఐక్యూఏసీ (అంతర్గత ప్రమాణాల మదింపు) డైరెక్టర్‌గా ప్రొఫెసర్ పి.వెంకట రమణ నియమితులయ్యారు. కెమిస్ట్రీ విభాగానికి చెందిన ప్రొఫెసర్ పి.వెంకట రమణ మాజీ రిజిస్ట్రార్‌గా పని చేశారు. ఇదివరకు ఉన్న ఐక్యూఏసీ డైరెక్టర్ ప్రొఫెసర్ పి.మురళీకృష్ణ స్థానంలో ఈయన్ను నియామకం చేశారు.

నీటి సరఫరాలో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: నగరంలో తాగునీటి సరఫరాలో అప్రమత్తంగా ఉండాలని అధికారులను మేయర్ వసీం ఆదేశించారు. సోమవారం నగరంలోని 39వ డివిజన్‌లో మేయర్ పర్యటించారు. తాగునీటి సరఫరాపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో ప్రతి ఒక్కరూ నీటిని వేడి చేసి వడపోత అనంతరం తాగాలని సూచించారు. ప్రతి నిత్యం నగరంలో తాగునీటి నమూనాలు అన్ని ప్రాంతాల్లో సేకరించి క్లోరినేషన్, తదితర పరీక్షలను నిర్వహించాలన్నారు. తుంగభద్ర డ్యాం నుంచి కొత్త నీరు పీఏబీఆర్ డ్యాంకు వస్తోందని తెలిపారు. ఇటువంటి పరిస్థితుల్లో సరఫరా అయ్యే నీటిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డ్యామ్‌కి కొత్త నీరు చేరినప్పుడు కొంతమేర రంగుమారే అవకాశం ఉన్నందున ముద్దలాపురం ఫిల్టరేషన్ పాయింట్‌లో ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. నగరంలో గ్యాస్ పైప్‌లైన్ కోసం రోడ్లను తవ్వి ఎక్కువ రోజులు అలాగే వదిలేయడం కారణంగా ప్రజలు ఇబ్బంది పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. మేయర్ వెంట కార్పొరేటర్ కమల్‌భూషణ్, ఈఈ సూర్యనారాయణ, ఏఈ బాబావలి, వైఎస్సార్‌సీపీ నాయకులు చింతకుంట మధు, రఫీ, ట్యాప్ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా ఉన్నారు.

చిత్తశుద్ధితో విధులు నిర్వర్తిస్తున్నాం

అనంతపురం మెడికల్: విధి నిర్వహణలో తాము చిత్తశుద్ధితోనే వ్యవహరిస్తున్నామని, పసికందు మిస్సింగ్‌లో తమ తప్పిదం ఏమీ లేదని మంత్రి సత్యకుమార్‌కు సర్వజనాస్పత్రి స్టాఫ్‌నర్సులు సువర్ణమ్మ, శరణమ్మ స్పష్టం చేశారు. పసికందు కనిపించకపోవడాన్ని తామే ముందస్తుగా పసిగట్టి అందరినీ అప్రమత్తం చేసినట్లు వివరించారు. సోమవారం ప్రభుత్వ సర్వజనాస్పత్రికి వచ్చిన మంత్రికి వారు వినతిపత్రం అందించి, తమ గోడు వెల్లబోసుకుంటూ వినతిపత్రం అందజేశారు. ఈ అంశంపై పరిశీలించాలని అక్కడే ఉన్న ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావును మంత్రి ఆదేశించారు. కాగా, సర్వజనాస్పత్రిలో శ్రీసత్యసాయి జిల్లా నగలూరుకు చెందిన అమృత, అనిల్‌కుమార్ దంపతుల బిడ్డ మిస్సింగ్‌పై గైనిక్‌లో విధులు నిర్వర్తిస్తున్న స్టాఫ్‌నర్సులు సువర్ణమ్మ, శరణమ్మ, ఎఫ్ఎన్ఓ సుజాతపై సూపరింటెండెంట్ చర్యలకు ఆదేశించారు. విచారణకు ప్రొఫెసర్లు డాక్టర్ వైద్యనాథ్, డాక్టర్ రవికుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ నాగమణిను నియమించారు. నివేదిక ఆధారంగా తదుపరి చర్యలుంటాయని, వారం రోజుల పాటు వీరు విధులకు హాజరు కాకూడదని ఉత్తర్వులు జారీ చేశారు.

జడత్వాన్ని తరిమేయడమే శివతత్వం



మాట్లాడుతున్న సామవేదం షణ్ముఖ శర్మ

అనంతపురం కల్చరల్: మనిషిలో సహజంగా ఉండే జడత్వాన్ని తరిమికొట్టే మహామంత్రంగా శివతత్వం ఆవిర్భావమైందని ప్రముఖ ప్రవచనకర్త సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. శ్రీరామకృష్ణ సేవా సమితి 20వ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక మూడవ రోడ్డులోని జీఆర్ ఫంక్షన్ హాలు వేదికగా సాగుతున్న ప్రవచనంలో భాగంగా సోమవారం రాత్రి షణ్ముఖశర్మ శివసాక్షాత్కారం అనే అంశంపై పలు ఆధ్యాత్మిక విశేషాలు తెలియజేశారు. శివుడి మూడోకన్ను అన్న దాంట్లో నిగూఢ అర్థం దాగుందన్నారు. మనిషిలో స్వార్థ గుణాలను రూపుమాపే మహోత్తర శక్తిగా మాత్రమే అర్థం చేసుకోవాలన్నారు. భక్తిమార్గంలో సమున్నత జీవితాన్ని ఆస్వాదించాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు శ్రీనృత్యకళా నిలయం చిన్నారులు ప్రదర్శించిన పలు నృత్యరీతులు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా స్పెషల్ కోర్టు జడ్జి శివశంకర్, రామకృష్ణ సేవా సమితి ప్రతినిధులు డాక్టర్ కృష్ణ శశి, ప్రవీణ్ కుమార్, శ్రీధర మూర్తి, శ్రీనిధి రఘు, శ్రీవల్లి, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు



చిత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, అధికారులు



గ్రామ మహిళ సంరక్షకురాలు రజియాను సత్కరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: అంకితభావంతో విధులు నిర్వర్తించడం ద్వారా మంచి గుర్తింపు వస్తుందని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించడంలో ప్రతిభ కనబరిచిన జీఎంఎస్‌కే (గ్రామ మహిళ సంరక్షకురాలు) రజియాబేగంను కలెక్టర్ అభినందించారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రజియా బేగంను సత్కరించి ప్రశంసాపత్రం అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బాల్య వివాహాల అరికట్టేందుకు అందరూ చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. బాల్యవివాహాల వల్ల జరిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో మహిళ శిశు సంక్షేమ శాఖ పీడీ శ్రీదేవి, చైల్డ్ లైన్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ కృష్ణమాచారి, ప్రొటెక్షన్ అధికారి చంద్రకళ, అవుట్ రిచ్ వర్కర్ కమలాక్షి, సిబ్బంది సురేష్, ఇర్ఫాన్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా విశిష్టత ప్రజలకు తెలియాలి

అనంతపురం అర్బన్: జిల్లాలోని చారిత్రాత్మక కట్టడాలు, సంస్కృతి, సంప్రదాయాల విశిష్టతను ప్రజలకు తెలిపేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న చారిత్రక కట్టడాలు, పురాతన ఆలయాల ఛాయా చిత్రాలను కలెక్టర్ ఆవిష్కరించి, మాట్లాడారు. ఛాయా చిత్రాలను ఏర్పాటు చేసిన పర్యాటక శాఖ అధికారులను కలెక్టర్ అభినందించారు. పర్యాటక, చారిత్రక ప్రదేశాపై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ కలెక్టర్ కరుణకుమారి, జిల్లా టూరిజం అధికారి కమతం జయకుమార్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సి.నారాయణరెడ్డి జయంతి



సి.నారాయణరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రచయితలు, కవులు

అనంతపురం కల్చరల్: జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత, ప్రఖ్యాత కవి సి.నారాయణరెడ్డి జయంతిని అనంత రచయితలు, కవులు ఘనంగా జరుపుకున్నారు. సోమవారం సాయంత్రం స్థానిక విశాలాంధ్ర బుక్ హౌస్ ప్రాంగణంలో జాషువా సాహిత్య పీఠం ఆధ్వర్యంలో సినారె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కవులు టీవీరెడ్డి, నానీల నాగేంద్ర, నాగలింగయ్య, రియాజుద్దీన్, పూజారి ఈరన్న అశ్వర్థరెడ్డి తదితరులు మాట్లాడారు. తెలుగు సాహిత్యానికి వెలుగులు నింపిన మహనీయుడు సినారే అని కొనియాడారు. సినీ, సృజన సాహిత్య ప్రపంచంలో సినారేది ప్రత్యేక శైలి అని తెలిపారు. తెలుగు సాహితీ సృజనకారుల్లో సినారె సృష్టించిన వైవిధ్యం ఆయనకే చెల్లిందన్నారు. సినారే కలం నుంచి జాలువారిన విశ్వంభర, ప్రపంచ పదులు, తెలుగు గజల్స్ తెలుగు పాఠకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలచిపోయాయని గుర్తు చేసుకున్నారు. అభ్యుదయ దృక్పథం, ప్రగతిశీల, చైతన్యవంతమైన సాహిత్యాన్ని సృష్టించిందని తెలిపారు. సినారే సాహిత్య ప్రచారానికి నడుంబిగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వరప్రసాద్, హరీష్, ప్రవీణ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.



మంత్రితో పాటు వచ్చిన నాయకులతో కిక్కిరిసిన ఎక్స్‌రే, రక్తదానం ఆవరణ



వైద్యులంతా మంత్రి చుట్టూ ఉండటంతో ఓపీ వద్ద క్యూ కట్టిన రోగులు



మంత్రి సత్యకుమార్ కోసం ఎదురు చూస్తున్న వైద్యులు, స్టాఫ్‌నర్సులు, సిబ్బంది



స్ట్రెచర్ లేకపోవడంతో వృద్ధురాలిని నడిపించుకుని వెళ్తున్న దృశ్యం

మంత్రి పర్యటనతో
రోగుల అవస్థలు

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి పర్యటన రోగులకు అవస్థలు తెచ్చి పెట్టింది. మంత్రి సత్యకుమార్ అనుచరులు పెద్ద సంఖ్యలో సర్వజనాస్పత్రిలోకి చొచ్చుకుని వచ్చారు. ఎస్ఎన్‌సీయూ, గర్భిణులు ఉండే వార్డుల్లోకి వెళ్లి హంగామా చేశారు. వాస్తవంగా అటువంటి ప్రాంతాల్లో ఇతరులకు ప్రవేశం లేదు. ఇన్‌ఫెక్షన్‌తో గర్భిణులు, బాలింతలు, పసికందులు ఇబ్బందులు పడుతారు. సోమవారం ఓపీ అధికంగా ఉంటుంది. ఇటువంటి సమయంలో మంత్రి పర్యటించడంతో ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, మంత్రి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. దీంతో ఓపీల్లో వైద్యులు కన్పించలేదు. రోగులకందే సేవల్లో తీవ్ర జాప్యం జరిగింది.

– సాక్షిఫొటోగ్రాఫర్, అనంతపురము